

యూనియన్ల రద్దును నిరసిస్తూ 'షార్'లో ధర్నా

ప్రజాశక్తి - సూళ్లూరుపేట



శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ (ఇస్రో)లో యూనియన్లను పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వం జీవో తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ సంయుక్తంగా బుధవారం శ్రీహరికోటలోని రెండో గేటు దగ్గర ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు జయప్రకాష్‌రెడ్డి, శివనాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అసోసియేషన్ నాయకులు ఎం.ప్రసాద్, గడ్డం మునిరాజా పాల్గొన్నారు.

జగనన్నా నిన్ను నమ్మేదెలా..?



టిటిడి ఫారెస్టు కార్మికుల భారీ ర్యాలీ

885వ రోజుకు టిటిడి అటవీకార్మికుల రిలేదీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఐదేళ్ల కిందట ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి హోదాలో సైతం హామీనిచ్చి అమలు చేయని పరిస్థితిలో 'జగనన్న నిన్ను నమ్మేదెలా' అంటూ అటవీ కార్మికులు నిరసన చేపట్టారు. రిలే నిరాహార దీక్షలు చేపట్టి 885వ రోజుకు చేరుకున్న సందర్భంగా బుధవారం ఉదయం తిరుపతిలోని హరే రామ హరేకష్ణ రోడ్డులోని టీటీడీ అటవీ కార్యాలయం ఎదుట కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ఐదేళ్ల కిందట ఇచ్చిన హామీని అమలు చేయని ముఖ్యమంత్రి, టీటీడీ బోర్డు తీర్మానాన్ని సైతం పట్టించుకోని టీటీడీ యాజమాన్యం, పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోని మంత్రులు, ఎమ్మెల్యేలు "జగనన్నే మా భవిష్యత్తు", 'జగనన్నే మా నమ్మకం' అంటూ చేస్తున్న ప్రచారంలో డొల్లతనం ఇదేనా? అని తీవ్రంగా ప్రశ్నించారు. 2019లో టీటీడీ బోర్డు అటవీ కార్మికుల్ని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తిస్తూ తీర్మానం చేసిందని మూడేళ్లు కావస్తున్నా పట్టించుకోకపోవటం అన్యాయమని విమర్శించారు. 2021 వ సంవత్సరంలో వరద తాకిడికి గురైన తిరుపతిని సందర్శించిన సందర్భంగా టిటిడి కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భరోసానిచ్చారని, తన హామీ 24 గంటల్లో అమలవుతుందని ప్రకటించారని గుర్తు చేశారు. రెండేళ్లుగా 24 గంటలు ఇంకా గడవలేదా? అని ప్రశ్నించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి బాధ్యతలు చేపట్టిన నాడే అటవీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, ఇప్పటివరకూ హామీని నిలబెట్టుకోకపోవడం ఏ రకంగా ధర్మమని అన్నారు. టీటీడీ బోర్డు ఛైర్మన్ వై వి సుబ్బారెడ్డి పలుమార్లు అటవీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పి పరిష్కరించలేదని గుర్తు చేశారు. 362 మంది ఉన్న టీటీడీ అటవీ విభాగంలో 162 మందిని పర్మినెంట్ చేసి, రెండు వందల మందిని పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. దేవదేవుని సన్నిధిలో ధర్మాన్ని కాపాడవలసిన చోట అధర్మంగా ప్రవర్తిస్తూ వివక్షకు పాల్పడుతుంటే ఎవరికి చెప్పాలని నిలదీశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, టిటిడి అటవీ కార్మికుల సంఘం నేతలు ఈశ్వర్ రెడ్డి, సురేష్, మునికష్ణ, మల్లికార్జున్, వాసు, కష్ణమూర్తి, సురేంద్ర, వేణు, గణేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

హక్కులను హరిస్తే అడ్డుకుంటాం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై ఏప్రిల్ 14-30 వరకు 'ప్రచార భేరి నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు వెల్లడించారు. ప్రచారభేరి వాల్ పోస్టర్లను వామపక్షాల ఆధ్వర్యంలో గూడూరు సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని, ఈ విధానానికి స్వస్తి పలకాలన్నారు. లేదంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దఎత్తున రైతులు చేపట్టిన ఉద్యమంతో వెనకడుగు వేశారని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, దేశంలోని ప్రభుత్వ సంస్థలను అమ్మకానికి పెట్టారన్నారు. బిజెపి ఏం చేస్తుందో రాష్ట్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ దాన్ని అమలు చేస్తుందన్నారు. పట్టణ సంస్కరణల్లో భాగంగా ఇంటిపన్నులు, కుళాయి పన్నులు, చెత్త పన్నులు వేస్తున్నారన్నారు. రైతులకు మీటర్లు పెట్టి దివాళా తీయించేందుకు సిద్ధమవుతుందన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి మోడీకి వంగి సలాం చేస్తున్నారని విమర్శించారు. అదానీ, అంబానీలకు పోర్టులను అమ్మకానికి పెట్టిందన్నారు. వీటన్నింటిని నిరసిస్తూ ఈనెల 14 నుంచి ప్రచారభేరి ప్రారంభించి 30 వరకూ కొనసాగించనున్నట్లు తెలిపారు. మోడీ వినాశకర విధానాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.యం. రాష్ట్ర కమిటి సభ్యులు నెల్లూరు యాదగిరి, సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, బి.వి.రమణయ్య, అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, పామంజి మణి, టి.వెంకట రామి రెడ్డి, చంద్రమోహన్ , నరసింహులు, పుట్టా శంకరయ్య, బి.సి.భాస్కర్, బి.చంద్రయ్య, సి.పి.ఐ. నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, ఎస్కే.కాలేషా, భాస్కర్ పాల్గొన్నారు.

రేపటినుంచి వామపక్షాల 'ప్రచారభేరి' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన నేతలు



వామపక్షాల ప్రచారభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు



విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలి : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో విద్యుత్‌శాఖ ప్రధానభూమిక పోషిస్తోందని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతిలో ఎలక్ట్రికల్ సేఫ్టీ వర్క్‌షాపును స్థానిక ఓ ప్రయివేట్ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ప్రజలు, జంతువులకు ప్రాణనష్టం కలగకుండా, విద్యుత్ శాఖ ఉద్యోగుల ప్రాణనష్టం కలగకుండా, విద్యుత్ సరఫరా పరికరాలు దెబ్బ తినకుండా, సబ్‌స్టేషన్‌లు పవర్‌లైన్లకు నష్టం కలగకుండా చర్యలు ఉండాలన్నారు. సబ్‌స్టేషన్లు, పవర్‌లైన్ల నిర్వహణలో భద్రత ప్రమాణాలు అమలులో చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థిక అభివృద్ధికి విద్యుత్ శాఖ చాలా ముఖ్యమని ఇటీవల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో మరోసారి రుజువైందని గుర్తు చేశారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే అందులో 9 లక్షల కోట్లు విద్యుత్ శాఖకు వచ్చాయని, ఇది మంచి పరిణామం అన్నారు. అనంతపురంలో వరుసగా విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అధికారులను అప్రమత్తం చేసి చర్యలు చేపట్టామన్నారు. ఒకేసారి 15వేల మంది ఎనర్జీ అసిస్టెంట్స్‌ను ఇప్పటికే నియమించామని, వారి సేవలు సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. ఒక పటిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థ సిద్ధం చేయాలని సూచించారు. ముందుకు వచ్చిన పెట్టుబడిదారులకు సహకరించి వారికి విద్యుత్ అందజేసి ప్రక్రియ సులభంగా మారేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సేఫ్టీ విషయంలో ఎటువంటి రాజీపడటానికి వీల్లేదని ఆదేశించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా అందరికీ పూర్తిస్థాయి అవగాహన వస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. సమావేశ ప్రాంగణంలో విద్యుత్ భద్రత ఉపకరణాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎలక్ట్రికల్ సేఫ్టీ, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్సపెక్టర్ విజయలక్ష్మి, రిటైర్డు సిఎండి గోపాల్‌రెడ్డి, ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు సుబ్బరాజు, జయబారతిరావు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలు కార్యరూపం దాల్చాలి: జేఎన్టీయూ విసి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



విద్యార్థులు చేసే నూతన ఆలోచనలు ఎప్పుడైతే కార్యరూపం దాల్చుతాయో వారి జీవిత లక్ష్యాలను సులువుగా చేరుకునే అవకాశాలు ఉంటాయని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ రంగ జనార్ధన అన్నారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని తరంగ్-2023 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్టీయూ విసి రంగ జనార్ధన మాట్లాడుతూ జేఎన్టీయూ పరిధిలోని 9 జిల్లాలలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో విద్యార్థులకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా రెగ్యులేషన్-2020ని జేఎన్టీయూ ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సులోని సబ్జెక్టులతో పాటు అదనపు కోర్సులను ఎంచుకొని వాటిలోనూ ప్రావీణ్యం చెందే అవకాశం దీనిద్వారా కలుగుతుందన్నారు. ఇండియా ఇప్పటికీ అభివద్ధి చెందుతున్న దేశంగానే పిలవబడుతోందని, దీనికి కారణం మ్యాథమెటిక్స్ లో ఎంతో ప్రావీణ్యం కలిగిన మనం మన ఆలోచనలకు కార్యరూపం దాల్చకపోవడమే ప్రధానమైన కారణమన్నారు. మన రెండు తెలుగు రాష్ట్రాలు ఆస్కార్ రావడంతో చాలా సంతోషంగా ఉన్నాయని, నాటు నాటు పాటలో నాటి స్వాతంత్ర్య పోరాటం రోజుల్లో మన దేశ ప్రజలు పడిన కష్టాలను అక్షరాల రూపంలో రచయిత చంద్రబోస్ అందించారని ఈ ఆస్కార్ అవార్డు రావడానికి ఇదే కారణమన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి రానున్న నాలుగేళ్లలో శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అనేక మార్పులు చేస్తున్నామన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి ఎంతో ముందు చూపుతో కళాశాలలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు.కళాశాల క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. సినీ నేపద్య గాయకులు సూథన్స్, శతిక పాల్గొని వారి పాటలతో విద్యార్థులను అలరింపజేశారు. డైరెక్టర్ మన్నెం వెంకటరామిరెడ్డి, కళాశాల సెక్రెటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ జయచంద్ర పాల్గొన్నారు.



సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ హరితను గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఫెడరేషన్ క్యాలెండర్, డైరీని కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని, ఎల్లపుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు బాలాజీ, విద్యాసాగర్, నాగమోహన్, సురేష్, అలీ అక్బర్, దామోదర్, రవి, నవీన్, మధు, మహిళా ప్రతినిధులు జ్ఞానాంబిక, రజిని, గీత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం రూ.27.34 కోట్ల లబ్ధి : డిఆర్ఓ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



మహిళా సాధికారత కోసం చిన్న చిన్న వ్యాపారాలను అభివద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో ఆర్థికంగా ఎదగాలని వై ఎస్ ఆర్ ఇ బి సి నేస్తం రెండవ విడతగా జిల్లాలో 18,229 మందికి రూ.27.34 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా, మార్కాపురం నుండి వై.ఎస్.ఆర్. ఇ.బి.సి. నేస్తం లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించగా , స్థానిక కలెక్టరేట్ నుండి డి.ఆర్.ఓ. శ్రీనివాస రావు, జిల్లా అధికారులు , లబ్ధిదారులు పాల్గొన్నారు. డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి పేద మహిళలకు 45 - 60 సం. మధ్య వయసు కలిగి ఉండి ఆర్థికంగా వెనుకబడినటువంటి ఉన్నతమైన వర్గాలు అయి కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ వంటి సామాజిక వర్గాల్లో పేద మహిళలైన వారికి 15 వేల నగదును వారి ఖాతాలో జమ చేసే కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లాలో రెండవ విడత 18,224 మంది కి 27 కోట్ల 35 లక్షలు జమ చేశామన్నారు. ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొని ఉపాధి మార్గాలు ఎంచుకోవడం ద్వారా కుటుంబంలో పురుషులకు మహిళలు చేదోడు వాదోడుగా ఉంటూ పేదరికం నుండి బయటపడాలని అన్నారు. సమావేశ అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఇ డి బిసి కార్పోరేషన్ బాబు రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో కార్పొరేషన్ ఉద్యోగులకు గుర్తింపుకార్డులు జారీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి



స్విమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగ్గా సేవలందించాలని టిటిడి జెఈవో సదా భార్గవి కార్పొరేషన్ ఉద్యోగులను కోరారు. టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ లో చేరిన స్విమ్స్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గుర్తింపు కార్డుల జారీని జెఈఓ ప్రారంభించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో గల జెఈవో కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన 25 మంది కార్పొరేషన్ ఉద్యోగులకు జెఈఓ చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జెఈఓ మాట్లాడుతూ స్విమ్స్ లో వివిధ సొసైటీల్లో పనిచేస్తున్న దాదాపు 1800 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన వేతనం ఇతర సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కార్పొరేషన్ లో విలీనం చేసినట్టు చెప్పారు. ఈవో ఎవి.ధర్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధతో కార్పొరేషన్ ఉద్యోగులకు మేలు చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించినట్లు తెలిపారు. ఆర్జిత సెలవులు వర్తింపచేశామని, ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించామని, గ్రాట్యూటీ చెల్లిస్తామని తెలియజేశారు. అదేవిధంగా గుర్తింపు కార్డుతో సుపథం మార్గం ద్వారా కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకునే అవకాశం కల్పించామని, రూ.20 చొప్పున నెలకు 10 లడ్డూలు సబ్సిడీపై పొందే అవకాశం ఇచ్చామని తెలియజేశారు. మొత్తం 17 రకాల ప్రయోజనాలు వర్తింపచేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, జనరల్ మేనేజర్ ప్రసన్నలక్ష్మి, ఎడి(పిఆర్) శ్రీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈదులగుంట చౌక దుకాణం 'సీజ్'

ప్రజాశక్తి -తొట్టంబేడు

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఈదులగుంట చౌక దుకాణం పై విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దుకాణంపై పలు ఆరోపణలు రావడంతో స్పందించిన విజిలెన్స్ అధికారులు తొట్టంబేడు సచివాలయం -2 సమీపంలో ఉన్న దుకాణంలో విజిలెన్స్ సిఐ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. సుమారు 3,140 కిలోల బియ్యం 73 చక్కర ప్యాకెట్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. నిరుపేదలకు అందాల్సిన బియ్యం ఇలా పక్కదారి పడుతుండడంతో పలుమార్లు తహసిల్దార్ కార్యాలయ అధికారులు హెచ్చరించిన సంబంధిత డీలర్ లక్ష్మమ్మలో మార్పు రాకపోవడంతో విజిలెన్స్ అధికారులు లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. ఈ దుకాణంలో సుమారు 450 కార్డుదారులు ఉన్నట్లు తెలిసింది. మండలంలో మొత్తం 36 చౌక దుకాణాలు ఉండగా 13,290 కార్డులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈదులగుంట చౌక దుకాణాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.



నీచ రాజకీయాలకు రోజులు దగ్గరపడ్డాయి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'మీ ఇంటి వద్దకు మీ నాని' ప్రారంభం



గత నాలుగు సంవత్సరాలుగా చంద్రగిరి నియోజకవర్గంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభివద్ధి చేయలేదని, 2014 నుండి 2019 వరకు తెలుగుదేశం పార్టీ చంద్రగిరి నియోజకవర్గంలో చేసిన అభివద్ధిని వివరించి 2024 ఎన్నికల్లో చంద్రగిరి కోటపై టిడిపి జెండా ఎగురవేస్తానని తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలో ' మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని ' కార్యక్రమాన్ని నియోజకవర్గ టిడిపి శ్రేణులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. అంతకుముందు మంగళం పంచాయతీలోని సాయిబాబా ఆలయంలో పులివర్తి నాని దంపతులు, కుమారుడు వినీల్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రతి ఇంటికీ తెలిపి వారి సమస్యలను గుర్తించి అధికారుల దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కషి చేస్తానన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమాన్ని ప్రారంభించడానికి స్థానిక టిడిపి నాయకులు ఏర్పాటుచేసిన తోరణాలు, బ్యానర్లను స్థానిక వైసీపీ నాయకులు ఎటువంటి సమాచారం లేకుండా తీసివేయడం అప్రజాస్వామికమన్నారు. ముందస్తుగా అనుమతి కోరి తగిన రుసుము చెల్లిస్తామన్నా సెక్రటరీ నిరాకరించారని, తెల్లవారుజామున ముందస్తు సమాచారం లేకుండా టిడిపి తోరణాలను వైసీపీ నాయకులు తొలగించారన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజకవర్గంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిర్ణయం తీసుకున్నారని, కానీ అధికార పార్టీ కార్యక్రమాలకు మాత్రం ప్లాస్టిక్ నిషేధం అనే విషయం గుర్తు రాలేదని, అదే ప్రతిపక్ష పార్టీలు ఏదేని బ్యానర్లు తోరణాలు ఏర్పాటు తొలగించడం సబబేనా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని ఈ నీచ రాజకీయాలకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. పులివర్తి నానిని గెలిపిస్తే చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ ఇన్చార్జి ఈశ్వరయ్య, మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, గూళ్లూరు మణి, సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ అధ్యక్షులు జడారెడ్డి భాస్కర్ రెడ్డి, కార్యదర్శి అల్లాబాషా పాల్గొన్నారు.

మే 31లోపు 'శ్రీనివాస సేతు' పూర్తవ్వాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి



తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీనివాస సేతు ప్రాజెక్టు పనుల పురోగతిపై టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి బుధవారం టీటీడీ పరిపాలన భవనంలోని తమ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మే 31 నాటికి ప్రాజెక్టు మొత్తం పనులు పూర్తి చేసి జూన్ 15వ తేదీ నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు. రోడ్ల మధ్యలో మీడియన్స్ అభివద్ధి కోసం అవసరమైన స్థలాన్ని వెంటనే కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గ్రిడ్డర్స్ పనులను త్వరగా చేపట్టాలని కోరారు. ప్రస్తుతం పూర్తయిన 92 శాతం పనుల పురోగతిని వచ్చే బోర్డు సమావేశంలో తెలిపేందుకు వీలుగా సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షలో జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసిఎఓ బాలాజీ, కార్పొరేషన్ ఎస్ఇ మోహన్, ఈఈ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల : భువనేశ్వర్‌కు చెందిన శివం కాండెవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బుధవారం ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించింది. ఈ సంస్థ తరఫున ప్రతినిధి వై.రాఘవేంద్ర ఈ మేరకు విరాళం డిడిని తిరుపతిలోని పరిపాలన భవనంలో టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు.



విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థినిలు తాము ఎంచుకున్న రంగాల్లో ఇదే ఉత్సాహంతో, స్ఫూర్తితో ఉన్నతంగా రాణించాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య ఎన్ రజని పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయస్థాయి 2 కే23 ఫియస్టా సాంస్కృతిక పోటీలు బుధవారం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా పాల్గొన్న వర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.రజని మాట్లాడుతూ ఈ జ్ఞాపకమైన మాటలతో ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఫెస్ట్ గురించి ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డైరెక్టర్ ప్రొ.పి.మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న అద్భుతమైన ప్రతిభ గురించి వారి ప్రేరణాత్మక పదాలతో ఈ సందర్భాన్ని పురస్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మరియు కో-కన్వీనర్ ఎ.సుప్రియ, ప్రియా దర్శిని, విద్యార్థి కన్వీనర్లు, విరించి కమిటీ, విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపల్ సిబ్బంది సమయపాలన పాటించి అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎం ఎన్ రెడ్డి పేర్కొన్నారు. పుత్తూ రు మున్సిపల్ కార్యాలయం సిబ్బందితో బుధవారం సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లా డుతూ కార్యాలయం సిబ్బంది ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలకు కార్యాలయం సందర్శించే ప్రజలతో సఖ్యతగా ఉండి, వారికి సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది ప్రజలకు సేవలు అందించే క్రమంలో ప్రజల నుండి డబ్బులు తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షల సమాచార పత్రిక ఆవిష్కరణ



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి విశ్వం సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఎంట్రెన్స్ టెస్ట్ సమాచార పత్రికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ ఆఫ్ ఎగ్జామ్స్ డైరెక్టర్ డి.దేవానంద రెడ్డి, విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్ రెడ్డిలు బుధవారం విజయవాడలోని విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్న విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డిని అభినందించారు. విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ఫలితాల్లో 118/120 మార్కులతో తమ విద్యార్థిని సి.మహతి రెడ్డి ప్రథమ ర్యాంకు సాధించింది అని, ఏపీఆర్జేసీ ఫలితాల్లో సి.పర్ణిక రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు, సైనిక్ ఫలితాల్లో వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో 4 ప్రథమ ర్యాంకులతో విశ్వం విద్యార్థులు విజయభేరీ మోగించారని తెలిపారు. అప్పుస్మా రాష్ట్ర నాయకులు బి.రవీంద్ర నాథ్ రెడ్డి, నరసింహా రెడ్డి, ఒ.వెంకటరమణ రెడ్డి, రెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొని సమాచార పత్రికను ఆవిష్కరించారు.

తల్లిదండ్రులను గౌరవించాలి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని స్థానిక సంయుక్త నగర్‌లోని తూర్పు వీధిలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆధ్వర్యంలో మాత పిత వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు మాట్లాడుతూ మాత పిత వందన కార్యక్రమం ప్రత్యేక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్నామని, మన భారతీయ సంస్కతి సాంప్రదాయాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కోటా సునీల్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులని గౌరవించడం, సన్మానించడం భారతదేశం యొక్క సాంప్రదాయమన్నారు. పాఠశాల సమితి అధ్యక్షులు మురళి రెడ్డి, పాఠశాల సమితి సభ్యులు, రమణయ్య , రవిచంద్ర, పాఠశాల ఏవో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర రాష్ట్ర పండుగ్గా గుర్తింపు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: స్థానిక శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ఇక నుంచి అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారికంగా ధవీకరిస్తూ సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి కషి ఫలించడంతో ఇకనుంచి గంగమ్మ జాతర మరింత అత్యంత వైభవంగా జరగనుంది.

మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామకష్ణాపురం సర్పంచ్ విరిత దేవేందర్ రెడ్డి వ్యవసాయ పంట పొలాల్లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోమని బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలై ఉండి 18 సం॥లోపు వయస్సు కల్గినవారు ఈ పథకానికి అర్హులన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.4 వేలు ఇస్తుందన్నారు. లబ్ధిదారులు అప్లికేషన్లు 15వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళ సమ్మాన్ సేవింగ్స్‌పై...

ప్రజాశక్తి-గూడూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖతో మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని తీసుకొచ్చినట్లు స్థానిక తపాలా శాఖ అధికారులు తెలిపారు. బుధవారం స్వచ్ఛ ఆంధ్ర సంస్థ ఛైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మతో వారు ఈ కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా పోణకా దేవసేనమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మార్చి నెల 31 వ తేదీన ఈ పథకాన్ని తీసు కొచ్చిందన్నారు. మహిళలకు భరోసా కల్పించే విధంగా ఉందని తెలిపారు. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని తారకరామా నగర్‌లో బుధవారం కరెంటు షాక్‌తో సుబ్రహ్మణ్యం (50) అనే వ్యక్త మృతి చెందాడు. గత కొంతకాలంగా మృతుడు పక్షవాతం కారణంగా మంచానికి పరిమితమయ్యాడు. సంఘటన స్థలానికి అర్బన్ సీఐ సుబ్బారెడ్డి చేరుకొని ప్రమాదానికి కల కారణాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

టీటీడీ డిగ్రీ కళాశాలలకు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్



ఎస్వీయు ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి

ప్రజాశక్తి-క్యాంపస్: టీటీడీ డిగ్రీ కళాశాలలు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ సాధించి, స్వయంప్రతిపత్తి దిశగా అడుగులు వేయడం అభినందనీయమని ఎస్వీయు ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో ప్రిన్సిపల్ మహదేవమ్మ అధ్యక్షతన బుధవారం సాయంత్రం "అర్బీ టువార్డ్స్ ఆటానమస్ - ఎ రోడ్ మ్యాప్" అనే అంశంపై వర్క్ షాప్ జరిగింది. టీటీడీ జేఈవో సదా భార్గవి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన టీటీడీ విద్యాశాఖ అధికారి ఎం.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో 33 విద్యాసంస్థలు నడుస్తున్నాయన్నారు. తిరుపతిలోని డిగ్రీ కళాశాలలు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించి చరిత్ర సష్టించాయని చెప్పారు. ఈ మూడు కళాశాలల ప్రిన్సిపల్ లను, అధ్యాపకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ గ్రేడ్ సాధించేందుకు సహాయ సహకారాలు అందించిన జేఈవో సదా భార్గవికి కతజ్ఞతలు తెలిపారు. టీటీడీ డిగ్రీ కళాశాలల అటానమి కమిటీ గౌరవ సలహాదారు ఎల్ఆర్ మోహన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలు మరో మెట్టు ఎక్కేందుకు స్వయం ప్రతిపత్తి కోసం ప్రయత్నించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్య కుమార్ కీలక ఉపన్యాసం చేశారు. కళాశాలలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉండడంతో స్వయం ఉపాధి అవకాశమైన కోర్సులు రూపొందించుకోవచ్చన్నారు. చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, అటానమస్ కో-ఆర్డినేటర్ డా పి. సుజన మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి గల కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు, డిప్లొమా కోర్సులు ప్రవేశ పెట్టుకోవచ్చన్నారు. ఎస్వీ యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ అప్పారావు, ఎస్వి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, వర్క్‌షాపు ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉమారాణి, కమిటీ మెంబర్ భువనేశ్వరి దేవి, వార్డెన్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుకు అనుమతి లేదు: తహశీల్దార్



ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలో ఎక్కడా అనుమతులు లేకుండా గ్రావెల్ అక్రమ తరలింపును అనుమతించే ప్రసక్తే లేదని స్థానిక నూతన తహశీల్దార్ శ్రీదేవి స్పష్టం చేశారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఆమె తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తరచూ రాత్రి వేళల్లో గ్రావెల్ అక్రమ తరలింపు జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. అయితే ఇకపై అనుమతులు లేకుండా పిడికెడు మట్టి ఎక్కడైనా తరలిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. స్థానిక అవసరాలకు కూడా గ్రావెల్ తరలింపుపై సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరి అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలింపుకు పాల్పడితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయడానికి వెనుకాడేది లేదన్నారు. అలాగే తగిన అనుమ తులతో గ్రావెల్‌ను ట్రిప్పల ద్వారా తరలిస్తున్న క్వారీ యజమానులు కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే మండలంలో భూకబ్జాలను సహించేది లేదన్నారు. ఎక్కడబడితే అక్కడ ప్రభుత్వ భూములను, కాలవ పోరంబోకు భూములను ఆక్రమించు కుంటే కబ్జారాయల భరతం పడటం ఖాయమన్నారు. ఇప్పటికే చెన్నేరి గ్రామం వద్ద కాలువ పోరంబోకు భూములను ఆక్రమించుకుని లేఅవుట్లు వేస్తున్న విషయం దష్టికి వచ్చిందని, దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రూ.10 కోట్లు ముంచేశారు: ఎన్ఆర్ఐ



ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని కొట్రమంగళానికి చెందిన మాజీ సర్పంచ్ దా మోదర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గంప వెంకటరమణా రెడ్డిలు రూ.10 కోట్ల నగదు తీసుకుని మోసం చేశారని ఎన్నారై మధుసూదన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధుసూదన్ రెడ్డి సొంత ఊరైన తిరుపతి జిల్లా కొట్ర మంగళం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నారై మాట్లాడుతూ చిన్నప్పటినుండి అన్నదమ్ములైన ఎన్ చంద్రశేఖర్ రెడ్డి ఎన్ దామోదర్ రెడ్డిలు తోడు నీడుగా అల్లారు ముద్దుగా ఆడుకుంటూ పెరిగామన్నారు. కుటుంబంలో నేను రెండో వాడినని చిన్నప్పటినుండి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించానన్నారు. ఉన్నత చదువులు చదువుకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో స్థిరపడ్డానన్నారు. తమ అక్క మొగుడైన గంప వెంకటరమణారెడ్డి, అన్న ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, తమ్ముడు ఎన్ దామోదర్ రెడ్డి తనతో ప్రేమతో స్నేహభావంతో మెలిగే వారన్నారు. తిరుపతి చుట్టుపక్కల భూమి రేట్లు విపరీతంగా పెరుగుతున్నాయని ఇక్కడ ఇన్వెస్ట్ చేయాలని సూచించారన్నారు. అన్న తమ్ముడు బావల మాట విని విడతల వారీగా సుమారు 10 కోట్ల రూపాయలను బ్యాంకుల ద్వారా వివిధ మార్గాల ద్వారా నగదును వారికి అందజేశానన్నారు. కొంత డబ్బులు వారి బాగోగుల కోసం తీసుకొని బాగుండాలని తెలిపాను అన్నారు. అయితే ఆ డబ్బుతో వారు ఆస్తులు కొని వాళ్ల బంధువుల పేరున పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంపించిన సుమారు పది కోట్ల రూపాయల డబ్బుతో ఒక్క సెంటు భూమిని కూడా కొనివ్వలేదని, వారు దారుణంగా మోసం చేసి ముంచేసారని కన్నీరు విలపించారు. డబ్బుల కోసం ఏదైనా చేయగల సమర్థులు మా అన్న తమ్ముడు బావని మీడియో ముఖంగా తెలియజేశారు. ఈ ముగ్గురు నుండి తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని కోరారు. 23 సంవత్సరాలుగా కష్టపడి సంపాదించిన డబ్బులను మోసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాకు జరిగిన అన్యాయంపై సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గూడూరు: పట్టణంలోని నారాయణ కాలేజ్‌లో వారి సహకారంతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించిన కాలేజ్ యాజమాన్యానికీ, వైద్యులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ వైద్యశిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, తగు మందులు అందించారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన



ప్రజాశక్తి-పుత్తూరు: రూరల్ మండలంలోని ఎగువాగుఊరు దళితవాడలో గత మూడు నెలలుగా అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య ప్రజాశక్తి దష్టికి తీసుకొని రావడంతో 'అందని రేషన్ బియ్యం.. అవస్థ పడుతున్న దళితులు' అనే శీర్షికతో గత 8వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో వార్త రావడంతో స్పందించిన జిల్లా మండల అధికారులు బుధవారం ఎగువాగుఊరు దళితవడలో రేషన్ బియ్యం వాహనాన్ని పంపించి ప్రజలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఎగువాగుఊరు దళితులు దళిత గిరిజన సంగం జిల్లా కార్యదర్శి వై నందయ్య, అంబేద్కర్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పుష్పరాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నూతన కమిటీ ఎంపిక





ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆటో వర్కర్స్ సమావేశం రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ పాల్గొన్నారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఆటోలకు ఇన్సూరెన్స్ తగ్గించాలని తెలిపారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. పుత్తూరు ఆటో యూనియన్ అధ్యక్షులుగా ఎస్ పురుషోత్తం, కార్యదర్శిగా ఎ.విజయ్, కోశాధికారిగా కె.శివలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఎ.వెంకటేష్, ఎస్.సతీష్, హరీష్, యా సిన్ భాష, దేవా రెడ్డి, రమేష్, కష్ణమూర్తి, బొబ్బులు, ధన, పురుషోత్తం, శివ, రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సెంట్రింగ్ షీట్స్ చోరీ నిందితులు అరెస్టు



ప్రజాశక్తి - తిరుపతి సిటి: భవన నిర్మాణాలకు ఉపయోగించే సెంట్రింగ్ షీట్స్‌ను దొంగతనం చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, యస్.ఐ యస్.నాగేంద్ర బాబు తెలిపారు. పేరూరుకు చెందిన దాటి సునీల్ (29), తిరుపతి సాయినగర్‌కు చెందిన పిండి గణేష్ (20), బైనపల్లి వెంకటక్రిష్ణ (19)ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడు నెలలుగా కొత్తగా భవన నిర్మాణాల వద్ద ఉపయోగించే సెంట్రింగ్ షీట్లు, పిల్లర్ బాక్సులు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలు చేస్తున్నారని ఎస్‌పి పరమేశ్వర రెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు నిఘా ఉంచామన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఏప్రిల్ 11న రేణిగుంట రోడ్డులోని ఆర్చి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనాన్ని అదుపులోకి తీసుకన్నామని చెప్పారు. వీరు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి 15 లక్షల విలువైన సెంట్రింగ్ షీట్లు, పిల్లర్ బాక్సులు, జాకీ రాడ్స్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపనున్నారు. కేసు వివరాలను అదనపు ఎస్‌పి క్రైం విమలాకుమారి, డిఎస్‌పి మురళీక్రిష్ణ, సిఐ శివప్రసాద్, ఎస్ఐ నాగేంద్రబాబు వెల్లడించారు.

28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అన్నమయ్య జిల్లా వీరబల్లి ఫారెస్టు బీటు పరిధిలో 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం తెలిపారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఏఆర్ ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన బందంలోని ఆర్ఎస్ఐ కే.సురేష్ బాబు బందం అన్నమయ్య జిల్లా సానిపాయ బేస్ క్యాంపు నుండి బయలుదేరి, గడికోట చేరుకుందన్నారు. అక్కడ నుంచి వీరబల్లి వైపు కూంబింగ్ చేపట్టగా, వీరబల్లి ఫారెస్టు బీటు పరిధిలో జరికోన ప్రాంతంలో కొంతమంది ఎర్రచందనం దుంగలను మోసుకెళుతూ కనిపించారన్నారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టేలోపు వారు దుంగలను పడేసి పారిపోయారని తెలిపారు. పారిపోతున్న వారిలో ఒకరిని టాస్క్ ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నట్లు చెప్పారు. ఇతను తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లాకు చెందిన శంకర్ వెంకటేశన్ (36)గా గుర్తించామన్నారు. విచారించగా తనను అదే ప్రాంతానికి చెందిన గణపతి అనే వ్యక్తి తీసుకొచ్చాడని, తనతో పాటు 14మంది వచ్చినట్లు తెలిపాడని చెప్పారు. తిరుపత్తూరు నుంచి చిత్తూరు మీదుగా రాయచోటి చేరుకుని 15 రోజుల క్రితం అడవిలోకి ప్రవేశించామని తెలిపాడని వివరించారు. తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి సీఐ బాలకష్ణ కేసును దర్యాప్తు చేస్తున్నారని అధికారులు తెలిపారు.

స్థల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఆటోనగర్‌లో సర్వేనెంబర్ 74/5 లో దళిత కమ్యూనిటీకి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి దుర్వినియోగం చేస్తున్న నాగేశ్వరరావుపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఆ స్థలాన్ని పరిరక్షించాలని ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ఎఎస్.శంకర్ రావు డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోనగర్ ఏర్పాటు సమయంలో బి. పండమ్మ సత్యసాయి సంఘాన్ని ఏర్పాటు చేసి అప్పటి నుంచి సంఘ కార్యకలాపాలు సాగిస్తున్నామన్నారు. ఆటోనగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని సత్యసాయి సంఘానికి అందించి తద్వారా దళిత కమ్యూనిటీ కార్యక్రమాల వినియోగానికి సహరించాలని అప్పటి కలెక్టర్ ఎస్ఎస్ రావత్‌ను విజ్ఞప్తి చేయడంతో అక్కడ ఉన్న 39 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆటోనగర్ యూనియన్‌కు 20 సెంట్లు, సత్యసాయి సంఘానికి 19 సెంట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ సంఘంలో కీలక వ్యక్తులు మతి చెందడంతో నాగేశ్వరరావు అనే వ్యక్తి ప్రవేశించి దళిత కమ్యూనిటీకి భవనం నిర్మాణంతో కార్యక్రమాలు చేపడతామని నమ్మించి సంఘం బైలాను తీసుకొని సంఘాన్ని తప్పుడు సంతకాలు సష్టించి, సంఘాన్ని తన స్వాధీలోకి తీసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కేటాయించిన భూమిని ఆక్రమించి, షాపులు నిర్మించి ఇతరులకు విక్రయిస్తూ దళిత వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నారని, ఆక్రమించిన భూమిలో షాపులను తొలగించి సంబంధిత అధికారులు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో ఆక్రమణ స్థలం కాపాడుకునేందుకు పోరాటం చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నేతలు కారమంచి మధు, సుబ్బరామయ్య, ముకుంద, రమేష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువతి హల్ చల్



ప్రజాశక్తి-గూడూరు: మద్యం మత్తులో యువతి హల్ చల్ చేసి అడ్డొచ్చిన మహిళపై దాడిచేసి బ్లేడుతో కోసి తీవ్ర గాయాలు పాలు చేసిన సంఘటన స్థానిక వివేకానంద రోడ్డులో బుధవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. వివేకానంద రోడ్డులో జరుగుతున్న కరమంత్రం కార్యక్రమానికి బంధువులు తిరుపతి నుండి కారులో కె.శోభన, ఆమె భర్తతో కలిసి కారులో గూడూరుకు వచ్చారు. కారును రోడ్డు పక్కన ఆపి భోజనాలు చేస్తుండగా, ఒక్క సారిగా పెద్ద శబ్దం రావడంతో వచ్చి చూడగా మద్యం మత్తులో ఓ గుర్తుతెలియని యువతి కారు అద్దాలను ధ్వంసం చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడున్న మహిళలు ఆ యువతిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా దుర్భాష లాడుతో శోభన అనే మహిళపై దాడి చేసి బ్లేడుతో గాయాలు పాలు చేసింది. ఫోన్ ద్వారా సమాచారం అందించగా వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ యువతిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు పెంచడంతో కార్మికుల హర్షం



ప్రజాశక్తి-తిరుచానూరు: స్థానిక పంచాయతీ కార్మికులకు జీతాలు పెంచడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీతాలు పెంచిన సర్పంచ్ రామచంద్రారెడ్డికి వారు గజమాల వేసి బుధవారం సత్కరించారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచనలతో తిరుచానూరు సర్పంచ్ జీతాలు పెంచడం అభినందనీయమన్నారు. కార్మికులతో రామచంద్రారెడ్డి ఎప్పుడూ సన్నిహితంగా మెలుగుతారన్నారు. ప్రస్తుత ఖర్చుల దృష్ట్యా కార్మికులు కుటుంబంతో సంతోషంగా ఉండాలని జీతాలు పెంచారన్నారు. కార్మికులకు ప్రతి సంక్రాంతికి కొత్త బట్టలు, కుటుంబాలకు సామాగ్రి సర్పంచ్ సొంత ఖర్చులతో ఇస్తున్నారని తెలిపారు. తిరుచానూరు పంచాయతీ వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తేనెమంచు పురుగు సస్య రక్షణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మామిడిలో నల్ల మచ్చులు, తేనె మంచు పురుగు సస్య రక్షణపై దష్టి సాధించాలని మండల ఉద్యానవన శాఖ అధికారి వెంకట సౌజన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం మండలంలోని కెబిఆర్ పురం, పట్టణంలోని చెర్లోపల్లి గ్రామంలో మామిడి తోటలో వెళ్లి మామిడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడికాయలపై నల్ల మచ్చులు ఉన్న వాటి నివారణకు, పూత పిందె దశలో అధికంగా ఉన్న తేనె మంచు పురుగు బంక సమస్య కాయ దశలో గమనించినట్లు తెలిపారు. మామిడి రైతు బంక సమస్యకు ఈమడ క్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసినట్లు తెలిపారు. తేనె మంచు పురుగు, బంక సమస్య ఉన్న కాయలపై థయోమిథాక్సాం 0.3 గ్రా లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలని తెలిపారు.

పక్షులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రంలో బుధవారం పక్షుల కేంద్ర సిబ్బందికి వివిధ రకాల పాములపై, పక్షులపై అవగాహన సదస్సును సూళ్లూరుపేట డిఎఫ్ఒ శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పక్షులపై అవగాహన కలిగించిన రిసోర్స్ పర్సన్‌గా పాండిచ్చేరికి చెందిన బయాలజిస్ట్ భూమ్ పాస్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ మాట్లాడుతూ పక్షుల యొక్క జీవన విధానాన్ని, వాటి సంతాన ఉత్పత్తిని తెలియజేసినట్లు తెలిపారు. విదేశీ విహంగాలు ఎలా మన దేశానికి నేలపట్టు పక్షులు కేంద్రానికి రాగలుగుతున్నాయో వాటిపై అవగాహన కలిగించినట్లు చెప్పారు. పాములు గురించి స్నేక్ సొసైటీ హైదరాబాద్ వారు అవినాష్ విషపాములు గురించి విషములేని పాములు గురించి నీటిలో ఉన్న పాములు గురించి ఎన్ని రకాల పాములు ఉన్నాయో వాటిని గురించి సిబ్బందికి తెలియజేశారు. రేంజర్ వర ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే చర్యలు



ప్రజాశక్తి-గూడూరు: నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి, హాన్స్, గుట్కాలు విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని తిరుపతి జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ ఎ.రాజేందర్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని దూర్గటి నగర్ పరిసర ప్రాంతాల్లో సెబ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు చేస్తుండగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న 12 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి, వారి వద్ద 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఒకటో పట్టణ పోలీస్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ అయిన ముద్దాయిలను మీడియా ముందు పోలీసులు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా జరగకుండా నిరంతరం నిఘా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా జరుగుతూ ఉంటే ప్రజలు తెలిసిన సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో గూడూరు సెబ్ డీఎస్పీ జానకిరామ్, డిఎస్‌పి సూర్య నారాయణ రెడ్డి, సెబ్ సీఐ విజయకుమార్, ఒకటో పట్టణ సీఐ హజరత్ బాబు, సెబ్ ఎస్సై శేషమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.